

# వాళ్ళు

అర్ధరాత్రి ఎప్పుడేనా నడుస్తుంటే, ఆ ఆలోచన నన్ను తినేస్తుంది.

అందులో సరిగ్గా అక్కడ....

మా సన్నటి సందు పెద్ద వీధిలో కలిపే మలుపు దగ్గర.... కొత్తగా కడుతున్న పెద్ద బిల్డింగు అరుగు మీద....

అర్ధరాత్రి పన్నెండు దాటిన ఆ సమయంలో ఏం కనిపించదు. అరుగు చీకట్లో స్ట్రీట్ లైట్ సన్నటి వెలుతురు చేతులు తారట్లాడుతూంటాయి. వాటి తారట్లాట మధ్య అరుగు మీద ఇనప చువ్వల్లా బిగదదన్నిన మందపాటి గొంగళీ ముసుగులే కనిపిస్తాయి.

కాని....నాకు ఆ చీకటి చీలిపోతూ....ఆ ముసుగుల లోపల., మందపాటి ఆ గొంగుళీల లోలోపల ఆకారాలు కనిపిస్తాయి....ఆ బలం నా చూపుల్ది కాదు....నన్ను తింటున్న ఆలోచనది....

ఎప్పుడో సరిగ్గా గుర్తులేదు. ఇంచుమించు ఓ నెల క్రితం చూశాను తనని .... పొద్దున్నే .... ఇంకా ఏడు కూడా కాలేదు .... సూర్యుడి పల్చటి వెలుగు మెత్తటి సూదుల్లా ఆ అరుగు అంచుల్ని తాకుతోం దప్పుడు.

చేతులకున్న దంతం గాజులు చప్పుడయ్యేలా....రెండు చేతులు పైకెత్తి....తలమీద దుప్పటీలాంటి ఎర్రటి ముసుగుని సవరించుకొంటోంది. తను....సూర్యుడి సన్నటి చూపు తన ముక్కు

మీద సిల్వర్ నత్తులో మెరిసింది.... అంతకన్నా అందంగా మెరిశాయి తన కళ్ళు. ఏం గుర్తు వచ్చిందో ఏయో వెలుగుని చూస్తూ ఫక్కుమని నవ్వుకుంది తను... రెండు బుగ్గల్లోను లోతుగా అందం గుంటలు పడింది....గుండె మీద పూసలు ఎత్తుగా స్వేచ్ఛగా ఎగిరిపడ్డాయి.

ఇవన్నీ కనపడలేదు నా కప్పుడు....వీటిలో ఏవో ఒకటి కని పించింది అన్నీ స్ఫురించేలా....

తనని చూడ లంటే మొత్తం అరుగు మీద గుంపు నంతటినీ వెతకవలసి వచ్చేది....మరీ పొద్దున్న కొద్దిసేపు తప్ప పగలంతా కని పడేదికాదు. తనే కాదు గుంపులో ఎవరూ కనపడరు. మళ్ళీ సాయంత్రం చీకట్లు తరిమేటప్పుడు కనపడేది కాస్సేపు....అందుకనే నాకు తను....తనతోపాటు వాళ్ళు చీకట్లో కూడా గుర్తే.

ఇళ్ళలో పోర్షన్స్‌లా, గుంపులో జట్లున్నాయి. తనెప్పుడూ వాడితోటే కనపడేది. బాగా సాగదీసిన రాగితీగలా ఎర్రగా ఉండే వాడు. ఎవరో పిలిచినప్పుడు విన్నాను. పేరు అచ్చుమయ్యట.... వాడి జుట్టు కూడా రాగి రంగులోనే ఉండేది. సంవత్సరాలుగా మట్టి తట్టలు, ఇటుకలు ఎత్తి నెత్తిమీద మోయటం వల్ల జుట్టు అలా అయిందేమో అనిపించింది. ఒంటి మీద ముతక బనీను....మోకాళ్ళ వరకూ పంచ....చేతికి తెల్లటి కడియం....ముక్కుకి రాగిపోగు.... తలకి ఎప్పుడూ చుట్టుకునే ఎర్రగళ్ళ సన్నగుడ్డ....తలపాగాలో ఆకు చుట్ట....తన పక్కన గమ్మత్తుగా ఉండేవాడు ...తనని వాడు చూస్తుంటే ఎంతో ప్రేమగా ఉండేది.

మా వీధిలో ఎన్నో రకాల ఇళ్ళున్నాయి. అంతకన్నా ఎన్నో రకాల మనుషులున్నారు. కాని దీనికి సంబంధించినంత వరకు అరుక్కి ఎదురుగా ఉండే మేడ గురించే చెప్పుకోవాలి. అందులో ఎవరో అమెరికన్స్ ఉంటున్నారు. సాయంత్రం పూట పద్దెనిమిదేళ్ళ వాళ్ళ పిల్ల స్కర్ట్‌లో బిగుతుగా, తెల్ల గోధుంగింజలా ఆరోగ్యన్ని పిటపిటలాడిస్తూ పచార్లు చేస్తూంటుంది. కాలుస్తున్న సిగరెట్ నుసితో పాటుగా, చూపుల్ని కూడా కింద అరుగు వేపు రాలుస్తూ ఉంటుంది. ఆ మేడ గురించి చెప్పుకోటం రవి గురించే.

రవి బొమ్మలు వేస్తాడు. అందాన్ని గీస్తానంటాడు. వాడూ చూశా డొకసారి అరుగు మీద తనని.

"పూసల్లో, కడియాల్లో లంబాడీ వాళ్ళని చూస్తుంటే పిచ్చెక్కు తుంది. తెలుసా?" అన్నాడు.

రవి ఎప్పుడూ తనొక్కదాన్నే చూసేవాడు. గుంపుని చూసే వాడు కాదు. కాని నాకు తనతోపాటు గుంపుని గూడా చూడటం అలవాటయింది. ఆ అరుగు మీద ఆ గుంపునే కాదు, ఇంకా చాలా అరుగుల మీద....చాలా గుంపుల్ని....

సిటీలో చాలాచోట్ల కొత్తగా కడుతున్న బిల్డింగుల దగ్గర రాళ్ళు మోస్తూనో, నీళ్ళు మోస్తూనో, సిమెంటు కలుపుతూనో కన పడే వాళ్ళు. వాళ్ళలో వాళ్ళుకాక, బయటి వాళ్ళెవరితోనూ కలివిడిగా మాట్లాడుతూ ఏనాడూ కనపడలేదు.

ఇంత హడావిడిగా ఒకళ్ళ నొకళ్ళు ఒరుసుకుంటూ గడిపే నగర జీవితంలో కేవలం వాళ్ళ వరకే వాళ్ళు. అడవిలో ఉండే ఓ తెగలా కాలం అడుస్తూ వీళ్ళు ఒక్కళ్ళే కనిపిస్తారు.

పగలంతా ఎండలోనూ, దుమ్ములోనూ గొడ్ల గుంపులా పని చేయటం....రాత్రి కాగానే అరుగుల పక్కన ఎర్రటి మంటల ముందు ఆనందాన్ని తుళ్ళుతూ నవ్వుతూ పంచుకోటం.... అది వాళ్ళ జీవితం. అందరూ కష్టపడతారు. కలిసి తింటారు. అందుకనే ఆనందం వాళ్ళది. వాళ్ళ తీరు వేరు వాళ్ళు వేరు. వాళ్ళ భాష వేరు.

"ఈ ఆడాళ్ళ దగ్గిర దారుణమైన రోగా లుంటాయట, నీకు తెలుసా?" అన్నాడు రవి ఇంకోనాడు.

ఈ మాట నేనూ విన్నాను చాలాసార్లు. కష్టపడే బలమైన ఆ శరీరాల్లో రోగాలు నిలవలేవు....కాని వాళ్ళలో ఉన్న అమాయకత్వం చుట్టూ కమ్ముకున్నాయి రోగాలు. వంశాను గతంగా వచ్చే రోగా లుంటాయని, వాటిని బాగు చేసుకోవటానికి మందులుంటాయని తెలి యని వాళ్ళ అజ్ఞానం తలుచుకున్నప్పుడల్లా వీళ్ళు నలుగురితోనూ అందరిలాగే కలిసిపోతే బాగుండు ననిపిస్తుంది.

ఇంతవరకు లచ్చుమయ్య తండ్రి మట్టి మోసి ఉంటాడు.

ఇప్పుడు లచ్చుమయ్య మోస్తున్నాడు. రేపు లచ్చుమయ్య కొడుకు ఇంతేనా....

"ఏదేనా రూము చూడకూడదు ఖాళీగా...." అన్నాడు రవి ఈ మధ్యన.

"ఎందుకు?" అంటే అయిదు రూపాయిలిచ్చి తనని తీసు కెళ్ళటానికన్నాడు....న్యూడ్ ఫోట్ కోసం.... మోడల్‌గా....

అరుగుకి ఎదురుగా ఉన్న అమెరికన్ అమ్మాయి మీది కెందుకు పోలేదో రవి దృష్టి, ఇలా తన వేపు మొగ్గిందనిపించింది నాకు.

గుంపులో మిగిలిన మగాళ్ళందరిలా ఉండేవాడు కాదు లచ్చు మయ్య....పని లేనప్పుడు మిగిలినవాళ్ళు బద్దకంగా దొర్లుతూనో, లేక పోతే రాగితీగల తట్టలా ఉండే తలలో ఆడాళ్ళచేత పేలు చూపించు కుంటూనో ఉండేవారు. లచ్చుమయ్య మటుకు అరుగు చివర కూచుని ఆకాశంలోకి, వెలుగులోకి చూస్తూ ఏదో ఆలోచిస్తూండేవాడు.

ఒకసారి వీధి చివర రిక్షావాడితో మాట్లాడుతూ కనిపించాడు. వాళ్ళని దాటుతూ వెళ్ళిపోతుంటే ఆ ఒక్క మాట వినిపించింది నాకు.

"అయితే ఆరు రోజులు రిక్షా తొక్కితే....ఏడో రోజు రాయలేదా రిక్షాకి...."అంటున్నాడు గొప్ప అద్భుతంలా ఆశ్చర్య పోతూ లచ్చుమయ్య.

రిక్షావాడు వాడి ఆశ్చర్యానికి ఫక్కుమని నవ్వాడు.

అవును, లచ్చుమయ్య కేం తెలుసు, ఆరు రోజులు శ్రమించిన వాడికి వారంలో ఏడో రోజు సెల వుండాలని? రోజంతా పనిచేసి కూలి తీసుకోవటమే కాక, ఆ కూలీ విధానాన్ని కాపాడే రూల్సున్నా యని- వాటికి కూడా కోర్టులు, మోసాలు, లంచాలు అన్నీ యధా విధిగా ఉన్నాయని వాడి కేం తెలుసు?

వాళ్ళ గుంపులో తెలిసి ఉన్న దొక్కటే. పని దొరకని రోజు బద్దకంగా అరుగుమీద దొర్లటమే సెలవు. దానికి ఓ గడువు

లేదు. ఒక్కోసారి నెలల తరబడి ఉండకపోవచ్చు. మరోసారి వారానికి రెండు మూడు రోజులు రావచ్చు.

మరో నెల గడిచింది.

అరుగు కెదురుగా మేడ టెర్రెస్ మీద అమెరిక నమ్మాయి సాయంత్రం పూట పచార్లు చేస్తూ సిగరెట్లు కాలుస్తూనే ఉంది.

ఇది వరకంతగా కాకపోయినా అర్ధ రాత్రుళ్ళు ఆలోచన నన్ను తింటూనే ఉంది.

కాని లచ్చుమయ్యే ఎక్కువగా రిక్షా వాడితో కనిపిస్తున్నాడు ఈ మధ్య.

ఓ రోజు నేననుకున్నంతా అయింది. బస్సుకోసం ఎదురు చూస్తూ నిలబడ్డాను నేను.

ఎదురుగా రిక్షా తొక్కుకుంటూ వస్తున్నాడు లచ్చుమయ్య. రిక్షాలో మనుషులున్నారు. హుషారుగా తొక్కుతున్నాడు. నన్ను చూసి చిన్నగా నవ్వాడు. గర్వంగా ఉంది ఆ నవ్వు. అందులో ఉత్సాహం ఉంది; కలుపు గోరుతనం ఉంది.

ఆ నవ్వుని అందరూ గుర్తుపట్ట గలరు దృష్టి అంటే.... ఆ మార్పు అందరికీ తెలుస్తుంది, జీవితం సంఘంలో పొందుతున్న మార్పది. ఇంకా ఎంతో తొందరగా అందరిలోనూ కావలసిన మార్పది.

కేవలం కూలి చేసుకునే ఓ లంబాడీ వాడు రిక్షావాడుగా మారటమే కాదు. ఓ కెగ కొత్త జీవితానికి నాందికావచ్చు అది. ముందుకు సాగినవాడు, వెనకబడిన వాడికి అందివ్వవలసిన విజ్ఞానాన్ని జీవితమే అందిస్తున్న తీరు కావచ్చది.

లచ్చుమయ్య రిక్షా నన్ను దాటుకు వెళ్ళిపోయింది. కాని నా ఆలోచన నాలో కదులుతూనే ఉంది. లచ్చుమయ్యకి కూడా ఇంక చాలా మందిలాగే వారంలో ఏదో రోజు సెలవుంటుంది. నెమ్మదిగా అరుగుబతుకు మానేసి తనతో ఏదో చిన్న గుడిసెలోకి మారి పోతాడు.

తను రోజూ సాయంత్రం వాడికోసం పొద్దుటినుంచి వాడితో

చెప్పాలనుకున్న ఊసులన్నీ మనసులో చోటుచాలక, గుండెల మీద పూసల్ని ఎగరేస్తుంటే, సంజె చీకట్లలో వాడి రాకకోసం గుడిసె గుమ్మం దగ్గిర ఎదురు చూస్తూ....

లచ్చుమయ్యా ఆ అరుగు మీద ఆ తెగ వాళ్ళందరి బ్రతుకుల్ని తన రిక్షాలో వేసుకుని, వాళ్ళకి దూరంగా ఉన్న సంఘంలోకి తీసుకు వెళ్లి నలుగురితో పెనవేస్తాడు.

తను లచ్చుమయ్యతో ఏ అరుగు పీకనో కాకుండా, ఓ గుడిసె కప్పుకింద బతికితే రవి దృష్టి తనని నగ్నంగా నిలబెట్టడానికి అయిదు రూపాయల విలవే కట్టదింక....

తను అక్కడ లేకపోతే నా దృష్టికి ఆ అరుగు ఖాళీగా కనిపించి, యౌవనం ఒళ్లు విరుచుకుంటూ పిరికిగా, పీచంగా తనని అలంబన చేసుకున్న ఆ ఆలోచన నన్ను తినదింక....

('ఆంధ్ర ప్రభ'లో ముద్రితము)